క్లుప్తంగా

జాతరను విజయవంతం చేద్దాం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను విజయవంతం చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం పద్మావతిపురంలోని తన నివాసం వద్ద తిరుపతిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నేతలు, సభ్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్.రామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి, విద్యాసాగర్, భూపతి పాల్గొన్నారు.

బాబు విమర్శలు విడ్డూరం

తిరుపతి కల్చరల్: దళిత మంత్రి ఆదిమూలం సురేష్‌పై చంద్రబాబు విమర్శలు చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో దళితులపై దాడులు సాగించారని పేర్కొన్నారు. వర్గీకరణతో మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకున్న దళిత ద్రోహి అని దుయ్యబట్టారు.

రికగ్నైజేషన్ కాలపరిమితి పెంపుపై హర్షం


విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల రికగ్నైజేషన్ కాల పరిమితిని మూడునుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం(అప్సా) రాయలసీమ జోన్ అధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీనికి సహకరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలత, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొఫెసర్ రజనికి అచీవర్ అవార్డు

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనికి ఉమెన్ అకడమిక్ అచీవర్ అవార్డు లభించింది. ధరిత్రి దినోత్సవం సందర్భంగా రీసెర్చ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమెకు అవార్డు అందజేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


శవాన్ని తీసుకెళుతున్న కార్పొరేటర్ ఉమా, అజయ్ కుమార్

తిరుపతి తుడా : అనాథ శవానికి అంతిమ సంస్కారాలు నిర్వహించిన రెండవ డివిజన్ కార్పొరేటర్ ఉమా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరే అజయ్‌కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. తిరుపతిలోని ఆటోనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన విషయాన్ని స్థానికులు గమనించి అజయ్ కుమార్‌కి సమాచారం అందించారు. ఆయన తన భార్య కార్పొరేటర్ ఉమా, పార్టీ నాయకులతో కలిసి అక్కడికి చేరుకుని సొంత ఖర్చులతో మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కే బాబు, మరి కొంతమంది నాయకులతో కలిసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

చంద్రగిరి కోటలో అస్ట్రోనైట్ స్కై టూరిజం



చంద్రగిరి(తిరుపతి రూరల్): అందరి మామ చందమామను దగ్గరగా చూసే అవకాశం చంద్రగిరి వాసులకు లభించింది. ఈ అవకాశాన్ని అస్ట్రోనైట్ స్కై టూరిజంలో భాగంగా భారత పురావస్తు శాఖ, రీజనల్ సైన్స్ సెంటర్ సంయుక్తంగా శనివారం స్థానికులకు, శ్రీవారి భక్తులకు కల్పించింది. చంద్రగిరి కోట ఇందుకు వేదిక అయింది. భారీ టెలీస్కోప్‌లతో చందమామను, నక్షత్రాలను దగ్గరగా చూపిస్తూ, వాటి గమనాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశాయి. స్థానికులు పురావస్తుశాఖ, సైన్స్ సెంటర్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎస్ఎల్‌వీ సీ55 విజయవంతంపై సంబరాలు



తిరుపతి గాంధీ రోడ్డు : పీఎస్ఎల్‌వీ సీ–55 ర్యాకెట్ విజయవంతం కావడంపై బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గోవిందరాజస్వామి గుడి వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఇస్రో చైర్మన్ సోమనాథన్‌కు అభినందనలు తెలుపుతూ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.

జవాన్లకు నివాళి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు శనివారం సాయంత్రం చంద్రగిరి పట్టణ వాసులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ నెల 20న జమ్ము–పూనే జాతీయ రహదారిపై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఆరుగురు ఆర్మీ జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే.

సేవా నిరతికి ప్రతీక రంజాన్

- చంద్రగిరిలో రూ.2 కోట్లతో షాదీ మహల్ ఏర్పాటు
- త్వరలో భూమి పూజ : ఎమ్మెల్యే చెవిరెడ్డి
- ముస్లిం మత పెద్దల కృతజ్ఞతలు


చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

తిరుపతి రూరల్/భాకరాపేట: త్యాగానికి, సేవా నిరతికి ప్రతీక రంజాన్ పండుగ అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని ఈద్గా మైదానాల్లో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారికి ఈద్ ముబారక్ చెప్పారు. చిన్నగొట్టిగల్లు మజీదులో అక్కడి ముస్లిం మతగురువులు, పెద్దలు దువా చేసి ఎమ్మెల్యేకు ఆశీస్సులు అందించారు. అర్ధంతరంగా ఆగిపోయిన షాదీ మహల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి పనులు పూర్తి చేయడానికి రూ.17 లక్షలు మంజూరు చేశారు. అనంతరం దీన్‌దార్‌పల్లి మజీదుకు చేరుకుని అక్కడి ముస్లింలతో ఆప్యాయంగా మాట్లాడి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రగిరిలో రూ.2 కోట్లతో షాదీమహల్

నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో వెయ్యి మందికి సరిపడేలా రూ.2 కోట్లతో షాదీమహల్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆయనను ముస్లిం మతపెద్దలు, గురువులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

రంజాన్ వేడుకల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : స్థానిక ఈద్గా మైదానంలో నిర్వహించిన రంజాన్ ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలు 30 రోజులు ఉపవాసాలు ఉండి దేవుడిపై భక్తిని, విశ్వాసాన్ని చాటుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. అలాగే దామలచెరువు మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

తిరుపతి కల్చరల్: రంజాన్ సందర్భంగా శనివారం తిరుపతి నగరంలోని ఈద్గా మైదానంలో ముస్లింలకు చిల్లీస్ రెస్టారెంట్ ప్రతినిధులు 10 వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చిల్లీస్ రెస్టారెంట్ అధినేత అంజి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తాము 15 ఏళ్లుగా రంజాన్ పండుగనాడు ఉచితంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న చిల్లీస్ రెస్టారెంట్ అధినేత అంజి, సిబ్బంది

గంగమ్మ ఆలయానికి కలశం బహూకరణ


కలశాన్ని అందజేస్తున్న దాత రాము ఆచారి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయం విమాన గోపురానికి సంబంధించిన రాగి కలశాన్ని తిరుపతికి చెందిన రాము ఆచారి బహూకరించారు. అమ్మవారి గర్భాలయ విమాన గోపురం ప్రథమ కలశాన్ని శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష పరిశీలించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ విమాన గోపురంపై ప్రతిష్టించనున్న కలశానికి పూర్తిగా బంగారు తాపడం చేయించాలని సూచించారు. అలాగే మహా కుంభాభిషేకం పనులను ఆదివారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం కలశాన్ని బహూకరించిన దాత రాము ఆచారిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిశీలన

తిరుపతి తుడా : తిరుపతి గంగమ్మ ఆలయం, పూలవానిగుంట మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, దేవిక, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలచేను గోపి, మార్కెట్ వంశీ పాల్గొన్నారు.

అన్నదాత ఆకలి తీర్చడమే ధ్యేయం


భోజనాలు వడ్డిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : రైతు ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశంతో వారపు సంతల్లో ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం దామలచెరువు వారపు సంతలో రైతులు, వ్యాపారులకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఆయన రైతులు, వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. వారపు సంతకు వచ్చే రైతు ఒక్కోసారి అన్నం తినడానికి కూడా డబ్బు లేక పస్తులతో ఇబ్బంది పడుతున్నారని, వారి కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారని వివరించారు. అలాగే మార్కెట్ రుసుము చెల్లించే అవసరం లేకుండా చేశారని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఇన్‌చార్జి నంగా బాబురెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, రహీం, రఘుపతి, సర్పంచ్ సునీత, కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, గుండ్లూరి సురేష్, భాస్కర్‌నాయుడు, రమేష్, చంటి, ఇమ్రాన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ సూరినేనివారిపల్లిలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కమలనాథన్(40)కు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన మృతుని నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): చిన్నతనం నుంచి విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి తెలిపారు. నవజీవన్ కంటి ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆర్ఆర్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం అండర్ 7–14 క్రీడాకారులకు టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే ఉద్దేశంతో ఆర్ఆర్ టెన్నిస్ అకాడమీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులు షర్మిష్ఠ, జోషిత్, చాందిని, గురురోహిత్, జయసాయికుమార్, కరుణ కుమార్, గణేష్‌ను అభినందించారు. వార్డు సభ్యుడు మునీంద్ర రాయల్, కోచ్‌లు కిరణ్, గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసు, మని, గంగాధరం, అంజి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడికి సత్కారం



తిరుపతి మంగళం : తిరుపతికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి నారాయణమూర్తికి బీసీ సెల్ విభాగం సౌత్‌జోన్ ఇన్‌చార్జ్ తొండమల్ల పుల్లయ్య, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ శనివారం సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో పత్తిపాటి మురళి, సురేష్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి ఆధ్వర్యంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి బాలాజీ కాలనీ మీదుగా రామచంద్ర పుష్కరిణి వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రమాదకర స్థితిలో ఉందని, అందువల్ల అల్ట్రా వయొలెట్ కిరణాలు భూమిపైనపడి విపత్తులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలుకు ప్రాధాన్యమిస్తోందన్నారు. అనంతరం రామచంద్ర పుష్కరిణి వద్ద ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి పర్యావరణ ఇంజినీరు నరేంద్ర బాబు, ఏఈలు మదన్‌మోహన్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, శశికళ, సుధాకర్, సైంటిస్ట్ ఆర్ కుమార్, రీజనల్ సైన్స్ సెంటర్ పాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

మట్టి జీవన తాత్వికతను తెలిపే కుమ్మరి కథలు

తిరుపతి కల్చరల్: మట్టి జీవన తాత్వికతను తెలిపిన కథలు కుమ్మరి కథలు అని ప్రముఖ రచయిత రాసాని తెలిపారు. ప్రముఖ రచయిత మూరిశెట్టి గోవిందు రాసిన కుమ్మరి కథలు పుస్తకాన్ని శనివారం సాయంత్రం యూత్ హాస్టల్లో అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి, చిత్తూరు జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాసాని మాట్లాడుతూ 90 దశకంలో మొదలైన ప్రపంచీకరణతో కులవృత్తులు తీవ్ర సంక్షోభానికి గురయ్యాయని తెలిపారు. ఛిద్రమవుతున్న కుమ్మరుల జీవన చిత్రాన్ని రచయిత గోవిందు ఆవిష్కరించారని పేర్కొన్నారు. శతావధాని ఆముదాల మురళి, అరసం నేత సాకం నాగరాజు, అధికార భాషా సంఘం సభ్యురాలు మస్తానమ్మ, కులవృత్తుల సంఘాల నేతలు అక్కినపల్లి లక్ష్మయ్య, బీవీ.కేశవులు, రుద్రకోటి సదాశివం, అరసం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు గంటా మోహన్, యువశ్రీ మురళి, కలువగుంట రామమూర్తి, నెమిలేటి కిట్టన్న, పల్లిపట్టు నాగరాజు, నీలకంఠం, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

తిరుపతిలో ఎన్నడూ చూడని అభివృద్ధి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష

- తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో తాను ఎన్నడూ చూడని అభివృద్ధి జరుగుతోందని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆయన శనివారం ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీషతో కలిసి గంగమ్మ ఆలయం మీదుగా తుడా కార్యాలయం వరకు చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో తిరుపతి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజల్ని వేధిస్తున్న ఇరుకు రోడ్లు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పడిందన్నారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధితో తిరుపతికి కొత్త శకం మొదలు కానుందన్నారు. చెప్పింది చెప్పినట్టు చేసి చూపించడమే తమ నైజమన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ రాబోవు రోజుల్లో తిరుపతి ప్రజలు మరింత అభివృద్ధిని చూస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈ దేవిక తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల క్వార్టర్స్ పరిశీలన



తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని రామ్‌నగర్, వినాయకనగర్, కేటాలోని టీటీడీ ఉద్యోగుల క్వార్టర్స్ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఫారెస్ట్, ఇంజినీరింగ్, గార్డెన్, హెల్త్ విభాగాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. క్వార్టర్స్‌లో తాగునీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలన్నారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఎస్టేట్ విభాగం ఓఎస్డీ మల్లికార్జున, అదనపు ఆరోగ్యాధికారి సునీల్‌కుమార్, ఈఈలు మురళీకృష్ణ, మనోహర్, డీఈలు చంద్రశేఖర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఏపీ, మద్రాస్ హైకోర్టుల జడ్జిలు రవీంద్రబాబు, వైద్యనాథన్ దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే తెలంగాణ ఎమ్మెల్యేలు రెడ్డినాయక్, రాజాసింగ్, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి రామానుజాచార్యుల అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 25 వరకు అన్నమాచార్య కళామందిరంలో రామానుజాచార్యుల అవతారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భగవత్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

రేపు మహతిలో శంకర విజయం నృత్య రూపకం

తిరుపతి కల్చరల్: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మహతి కళాక్షేత్రంలో శంకర విజయం నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నట్లు తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్.వెంకటాచలం, కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

30న వాసవీ జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 30న అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు పాలక మండలి అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ శెట్టి తెలిపారు. ఆయన శనివారం సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

1న సామవేద పారాయణం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో చతుర్వేద పారాయణ యజ్ఞంలో భాగంగా మే 1 నుంచి జూన్ 30 వరకు సామవేద(కౌతమ) పారాయణం జరుగనుంది. తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,354 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. స్వామివారి దర్శనం టోకెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది.

5న కపిలేశ్వరాలయంలో పత్ర పుష్పయాగం

తిరుపతి కల్చరల్: కపిలేశ్వర స్వామి ఆలయంలో మే 5వ తేదీన పత్ర పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందుకోసం మే 4వ తేదీ సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. మే 5న ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం 10 నుంచి 12 గంటల వరకు పత్ర పుష్పయాగం వైభవంగా చేపడతారు.

నెరవేరిన మూడు దశాబ్దాల కల

- గ్రీన్ పార్క్ వీధికి లింక్ రోడ్డు నిర్మాణం
- డిప్యూటీ మేయర్‌కు స్థానికుల కృతజ్ఞతలు

తిరుపతి తుడా: ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సదుపాయం అవసరం. ఈ విషయాన్ని గత పాలకులు విస్మరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి ఏక కాలంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటుకు పూనుకున్నారు. అలాగే కూడళ్ల విస్తరణ, రద్దీ ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. తాజాగా కాలిబాటగా ఉన్న గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వీధి లింక్ రోడ్డును పూర్తి చేసి స్థానికుల మూడు దశాబ్దాల కలను నెరవేర్చారు.

టీటీడీ చౌల్ట్రీస్ రెండో సత్రాలు ఎదురుగా ఉన్న గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో 200లకు పైగా కుటుంబాలున్నాయి. ఈ ప్రాంతానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఏదైనా అత్యవసరమైతే డీఆర్ మహల్ వద్దనున్న అండర్ బ్రిడ్జి మార్గమే దిక్కు. వర్షాకాలంలో ఆ బ్రిడ్జి నీటితో నిండిపోతే ఇక అంతే సంగతులు. తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రెండు రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. లింక్ రోడ్డు ప్రతిపాదన ఉన్నా 30 ఏళ్లుగా గత పాలకులు పట్టించుకోలేదని తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్ నుంచి రైల్వే ట్రాక్ పొడవునా ఉన్న రహదారికి 33 అడుగుల వెడల్పుతో లింక్ ఇస్తే సరిపోతుందని భావించారు. అనుకున్నదే తడవుగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి శనివారం ఉదయానికల్లా రోడ్డును పూర్తి చేశారు. దీంతో స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త రోడ్డుతో వెంకటేశ్వర థియేటర్ రోడ్డుకు, డీఆర్ మహల్ అండర్ బ్రిడ్జి రోడ్డుకు కలపడంతో ఆ ప్రాంత వాసులకు ఉపశమనం లభించింది. డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తాము మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. రూ.వందల కోట్లతో తిరుపతి ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.


అభివృద్ధి చేసిన గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ లింక్ రోడ్డు


అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వీధి లింక్ రోడ్డు (ఫైల్)